మెడికల్ కాలేజీలపై తప్పుదోవ..

నిర్మాణంలో ఆదోని మెడికల్ కాలేజీ

నంద్యాల మెడికల్ కాలేజీ

- రాజకీయం చేస్తున్న వైసిపి, టిడిపి
- జగన్ హయాంలో సెల్ఫ్ ఫైనాన్స్, బాబు హయాంలో పిపిపి
- రెండు పార్టీల విధానాలూ నష్టదాయకమే

ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణంపై కూటమి, వైసిపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వం, ఇప్పుడు కూటమి సర్కార్ తెచ్చిన రెండు విధానాలూ ప్రజలకు ఏమాత్రం ప్రయోజనకరం కాదు. అయినప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా తాము చేసిందే గొప్ప అంటూ రెండు పార్టీల నేతలు చెప్పుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వైసిపి హయాంలో నిర్మించిన నంద్యాల, నిర్మాణం పూర్తికాకుండా ఆగిపోయిన ఆదోని మెడికల్ కాలేజీల వేదికగా ఈ రెండు పార్టీల నేతలు చేస్తున్న హడావుడి చూసి అంతా విస్తుపోతున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

2019-24 మధ్య వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మించింది. వీటిలో నంద్యాల మెడికల్ కాలేజీ ఒకటి. ఈ కాలేజీకి 150 సీట్లు కేటాయించారు. గతంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా 15 శాతం, స్టేట్ కోటా కింద 85 శాతం సీట్లను భర్తీ చేసేవారు. నామమాత్రపు ఫీజు రూ.15 వేలు మాత్రమే వసూలు జరిగేది. వైసిపి ప్రభుత్వం తెచ్చిన విధానంలో ఆలిండియా కోటా 15 శాతం, స్టేట్ కోటా కింద 42 శాతం సీట్లు మొత్తం 57 శాతం ఎంబిబిఎస్ సీట్లను మాత్రమే నామమాత్రపు ఫీజు రూ.15 వేలతో భర్తీ చేశారు. మిగిలిన 43 శాతం సీట్లను అంటే 150 సీట్లలో 64 సీట్లను బి, సి కేటగిరి కింద రూ. 12 లక్షలు, రూ.20 లక్షలు ఫీజు వసూలు పెట్టింది. నంద్యాల మెడికల్ కాలేజీలో ఇదే విధంగా ఫీజుల వసూలు జరుగుతోంది. మెరిట్లో సీటు సాధించిన విద్యార్థులు సైతం ఏడాదికి దాదాపు రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సామాన్య కుటుంబాల పిల్లలు ఎంబిబిఎస్ సీటు సాధించినా ఇంత పెద్దమొత్తంలో ఫీజు చెల్లించలేక వైద్యవిద్యకు దూరమవుతున్నారు. వైసిపి తెచ్చిన విధానం అప్పట్లో పెద్దదుమారమే రేపింది. అయినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగింది. తాము అధికారంలోకి వస్తే మెడికల్ కాలేజీల్లో వైసిపి ప్రభుత్వం తెచ్చిన ఫీజు వసూలు విధానాన్ని రద్దు చేస్తామని లోకేష్, చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పిపిపి విధానం తెచ్చి సామాన్యుల పిల్లలకు పూర్తిగా వైద్యవిద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో ఫీజు వసూలుకు తెరలేపిన వైసిపి ఇప్పుడు తాము అంతా మంచి చేసినట్లు ఆందోళన చేస్తుండటం విడ్డూరంగా ఉంది.

చంద్రబాబు ప్రభుత్వం 12 మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో చేపట్టేందుకు సిద్ధమైంది. అందులో ఆదోని మెడికల్ కళాశాల దీనిపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజాసంఘాలు, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన నెలకొంది. దీంతో పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. గుజరాత్లో విధానంలో మెడికల్ కాలేజీలు ఇప్పటికే నడుస్తున్నాయి. ఈ విధానంలో ప్రయివేటు వ్యక్తులకు ప్రభుత్వ భూములతోపాటు నిర్వహణా అనుమతులు ఇచ్చేసింది. కాలేజీల నిర్వహణ అంతా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోనే ఉంది. ఒక కాలేజీలో 150 సీట్లు ఉంటే వాటిలో 15 శాతం ఆలిండియా కోటా కింద నామమాత్రపు ఫీజుతో సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 85 శాతం సీట్లకు సగటు ఫీజు రూ. నాలుగు లక్షలు, బి కేటగిరిలో సీట్లకు రూ.13 లక్షలు, సి కేటగిరి సీట్లకు రూ.25 లక్షలు చొప్పున గుజరాత్ పిపిపి మోడల్ మెడికల్ కాలేజీల్లో వసూలు చేస్తున్నారు. ఇక్కడ కూడా అదేవిధానం అమలు చేసే పరిస్థితి రానుంది. మెరిట్ విద్యార్థులకు రూ.15 వేల ఫీజుతో రావాల్సిన సీట్లకు రూ.లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్న మాట. కూటమి ప్రభుత్వం తెస్తున్న పిపిపి విధానం వైసిపి ప్రభుత్వం తెచ్చిన విధానం కంటే అత్యంత దారుణంగా ఉండనుంది. ఈ రెండుపార్టీలు ఇప్పుడు మెడికల్ కాలేజీ సీట్లపై తమ విధానాలు గొప్పగా చెప్పడం విడ్డూరంగా ఉంది. ఏలూరులో వైసిపి, కూటమి నేతలు మెడికల్ కాలేజీలపై చేస్తున్న ధర్నాలు చూసి అంతా నవ్వుతున్న పరిస్థితి నెలకొంది.

రైతుల పక్షాన 24న మహాధర్నా

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-ఆస్పరి

కారు చౌకగా రైతుల నుంచి భూమిని లీజుకు తీసుకుంటున్న సోలార్ కంపెనీల వైఖరికి వ్యతిరేకంగా ఈ నెల 24 న విజయవాడలో మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికె. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కర్నూలు జిల్లా ఆస్పరి మండలం జోహారపురం, ఆలూరు మండలల్లోని మొలగవల్లి గ్రామంలో పర్యటించి సోలార్ కంపెనీలకు భూమి ఇస్తే జరిగే నష్టాన్ని రైతులకు వివరించారు. అనంతరం ఆలూరు సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సోలార్ కంపెనీలు సంవత్సరానికి ఎకరాకు రూ.30 వేల లీజుకు తీసుకుంటుందన్నారు. కంపెనీ 5 ఎకరాల భూమిలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తే రూ.80 లక్షల దాకా ఆదాయం పొందుతుందన్నారు. రైతులకు మాత్రం రూ.30 వేల ప్రకారం కారు చౌకగా లీజుకు తీసుకొని దగా చేస్తున్నారన్నారు. పచ్చని పంట పొలాలను సోలార్ కంపెనీలకు లీజుకు ఇచ్చారన్నారు. సంవత్సరానికి ఎకరాకు రూ.50 వేలు కౌలు ఇవ్వడంతో పాటు ప్రతి రెండేళ్లకు ఒకసారి 20 శాతం కౌలు పెంచాలని డిమాండ్ చేశారు. సోలార్ కంపెనీ రైతులను మోసం చేయకుండా ప్రభుత్వం కౌంటర్ గ్యారెంటీ ఇవ్వాలన్నారు. భూములకు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంటేషన్ రైతుల దగ్గర ఉంచుకొని జిరాక్స్ కాపీలను మాత్రమే సోలార్ కంపెనీలు తీసుకునే విధంగా ప్రభుత్వం చూడాలన్నారు. 2013 భూ సేకరణ చట్టానికి లోబడే భూమి కొనుగోలు విధానం ఉండాలన్నారు. ప్రస్తుతం సోలార్ కంపెనీలు ఎకరాకు 5.20 లక్షలు భూమి కొనుగోలు చేస్తున్నాయని, అలా కాకుండా సారవంతమైన భూములను 20 లక్షలు చౌవుడు భూములను రూ.10 లక్షలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 20 డిమాండ్లపై మహా ధర్నా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని రైతులు వ్యవసాయ కార్మికులు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు హనుమంతు, బాలకృష్ణ, రైతు సంఘం నాయకులు వెంకటేష్, మధురెడ్డి ఈరన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

డెంగీలో అనుమానిత కేసులే అధికం

- ముందు జాగ్రత్తతో వైరల్ జ్వరాల నియంత్రణ
- వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- ప్రజాశక్తితో జిల్లా మలేరియా అధికారి నూకరాజు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మలేరియా, డెంగీ, చికున్ గున్యా, తదితర వైరల్ జ్వరాలను జాగ్రత్తలతో నివారించుకోవచ్చని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. విష జ్వరాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఆ వ్యాధులు ప్రాణాంతకం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది డెంగ్యూ వ్యాధి లో అనుమానిత కేసులే అధికంగా వచ్చాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ, మలేరియా పరీక్ష కిట్లు అందుబాటులో ఉంటాయని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

జిల్లాలో వైరల్ జ్వరాల విజృంభణ ఎలా ఉంది?

డిఎంఓ: 2024లో 225 డెంగీ కేసులు నమోదు కాగా 2025లో 203 కేసులు వచ్చాయి. సస్పెక్టెడ్ కేసులు 2024లో 1285 కేసులు రాగా 2025లో 2224 కేసులు వచ్చాయి. మలేరియా కేసులు 2024లో 17 రాగా 2025లో 9 కేసులు వచ్చాయి. చికెన్ గున్యా కేసులు 2024లో 10 రాగా 2025లో 11 కేసులు వచ్చాయి. మెదడు వాపు వ్యాధి కేసులు 2024లో 2 నమోదు కాగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఒక కేసు కూడా నమోదు కాలేదు.

డెంగీ, మలేరియా పరీక్షలు ఎక్కడ అందుబాటులో ఉన్నాయి?

డిఎంఓ: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగీ, మలేరియా పరీక్ష కిట్లు అందుబాటులో ఉంటాయి. రోగుల నుంచి సేకరించిన నమూనాలను కర్నూలు జిజిహెచ్, ఆదోని ఏరియా ఆసుపత్రులకు వ్యాధి నిర్ధారణకు పంపిస్తారు. ఈ వ్యాధులకు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

మలేరియా ఎలా వస్తుంది. రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు ఏమిటి?

డిఎంఓ: ప్లాస్మోడియం పరాన్న జీవుల వల్ల మలేరియా వస్తుంది. పరాన్న జీవులు పోకిన ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు ద్వారా ప్రజలకు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వర్షా కాలంలో దోమలు ఎక్కువవడం వల్ల ఎక్కువగా ఈ వ్యాధి ప్రబలుతుంది. చలి పణుకుతో కూడిన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, పళ్ళునొప్పులు ఈ జ్వరంలో వస్తాయి. మలేరియా మందులను వైద్యులు సూచించిన విధంగా తీసుకోవాలి. పరిసరాలలో నీటి నిల్వలను లేకుండా చూసుకోవాలి. ఇళ్లలో, గోడల పై దోమల మందు చల్లించుకోవాలి. ఆరు బయట నిద్రించకూడదు. దోమల బారిన పడకుండా దోమ తెరలు వాడాలి. ఇంటి కిటికీలకు, తలుపులకు జాళీలు బిగించుకోవాలి.

డెంగీ వ్యాధి ఎలా వస్తుంది? లక్షణాలు ఎలా ఉంటాయి?

డిఎంఓ: డెంగీ వ్యాధి చిన్నపిల్లల నుంచి పెద్దవారి దాకా సోకుతుంది. వైరస్ వలన కలిగే ఈ వ్యాధి ఆడ 'ఎడిస్' రకం దోమకాటు ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు ఇండ్లలోని నీటి నిల్వల్లో మాత్రమే పెరుగుతాయి. ఈ దోమలు పగలు కుడతాయి. ఈ వ్యాధి హఠాత్తుగా వచ్చి తీవ్రమైన జ్వరంతో మొదలవుతుంది. ఈ వ్యాధిని ఎలిసా పరీక్ష ద్వారా నిర్ధారిస్తారు. కండ్లు కదిలించలేని పరిస్థితి, ఎముకల్లోనూ, కండరాలను భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు (రాష్) వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన చాలా ప్రమాదకర లక్షణాలు. ఈ వ్యాధికి పూర్తి చికిత్స లేదు. లక్షణాలను బట్టి వైద్యులు ఉపశమన చర్యలు చేపట్టాలి. వ్యాధి తీవ్రంగా ఉన్నట్లయితే ప్రభుత్వ సర్వజన, జిల్లా ఆసుపత్రులను సంప్రదించాలి. పూర్తిగా కోలుకునే వరకు వైద్యుని పర్యవేక్షణలో ఉండాలి. నిర్లక్ష్యంల చేస్తే ఈ వ్యాధి ప్రాణంతకంగా మారొచ్చు. రక్త సమూనాలను పరీక్షించి వ్యాధి నిర్ధారణ (ఎలీసా పరీక్ష ద్వారా) పొందాలి.

డెంగీ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డిఎంఓ : తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ డబ్బాలు ఇంటి పరిసరాలలో ఉంచకుండా. చూడాలి. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి. నీటి తొట్టెలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మరల నింపుకోవాలి. వాటర్ బ్యాంకులు, ఇంటిలో నీటి నిల్వల మీద దోమలు జొరబడకుండా మూతలు వేసి ఉంచాలి.

చికెన్ గున్యా ఎలా వస్తుంది? లక్షణాలు ఎలా ఉంటాయి?

డిఎంఓ : దోమ కాటు ద్వారా వ్యాపించే ఈ వ్యాధి వల్ల మనిషి బలహీనపడి కీళ్ల నొప్పులతో ఎ కదల లేని స్థితిలో ఉంటాడు. ఈ వ్యాధి ఎక్కువ మందికి ఒకేసారి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన వారు వ్యాధి నిరోధక శక్తి కోల్పోయి ఇతర వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఈ వ్యాధిలో అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి. ఒళ్ళు నొప్పులు ఉంటాయి. వ్యాధి తిరగబడినపుడు తీవ్రమైన జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. ప్రాణభయం లేనప్పటికి వ్యాధి వల్ల వచ్చిన నీరసం, నొప్పుల వల్ల కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది.

ఆదర్శ కమ్యూనిస్టు జెఎన్ శేషయ్య

ఆదర్శవంతమైన కమ్యూనిస్టు జెఎన్.శేషయ్య అని సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఏ.గపూర్ అన్నారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం సీనియర్ నేత జెఎన్.శేషయ్య సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. (వార్త మెయిన్‌లో..)

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఏ.గపూర్

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విఎస్ఆర్ పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో ఉల్లి, టమోట పండించే రైతులతో చర్చించడానికి సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు(విఎస్ఆర్) కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక అనేక అవస్థలు పడుతున్న విషయం జిల్లా ప్రజలకు తెలుసని, ఉల్లి, టమోట రైతులతో చర్చించడానికి రేపు ఉదయం 10 గంటలకు మార్కెట్ యార్డులో ఉన్న రైతులతో చర్చిస్తారన్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటిగంటకు పత్తికొండ టమోట మార్కెట్‌ను సందర్శించి అక్కడి రైతులతో గిట్టుబాటు ధర గురించి చర్చిస్తారన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆదోని దగ్గర నిర్మాణం అవుతున్న మెడికల్ కాలేజ్ సందర్శిస్తారని తెలిపారు.

పేరుకే 60 అడుగుల రోడ్డు

- నడవడానికి 4 అడుగులు రోడ్డు కూడా లేదు
- రోడ్డుపై జారిపడి తన భర్తకు కాలు విరిగిందని కన్నీళ్లు పెట్టుకున్న మహిళ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : 4వ తరగతి ఉద్యోగుల కాలనీ మీదుగా వెళ్లే 60 అడుగుల రోడ్డుపై అనేకమంది కిందపడి కాళ్ల చేతులు విరుగుతున్నాయని, దుర్వాసనతో అనారోగ్యాలకు గురవుతున్నామనీ స్థానిక మహిళలు అమీనాబి, నజీమా, రామలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, జరీనా, ధర్మానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికులతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. వారు మాట్లాడుతూ రోడ్డుపై జారిపడి వీరన్ననే ఎఎస్ఐకి కాలు విరిగిందని తెలిపారు. రోడ్డుపై నీళ్లు నిలిచి దుర్వాసన వల్ల అనేక మంది అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్ల కొరకు రావడం తప్ప ప్రజా ప్రతినిధులు తమ కాలనీ సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. తేళ్లు,పాములకు భయపడి చీకటి పడ్డాక బయటకు రావడానికి భయపడుతున్నామని చెప్పారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ అందరికీ సమానంగా ఇంటి పన్నులు పెంచుతున్న అధికారులు అసమానతలతో అభివృద్ధి పనులు చేస్తున్నారని విమర్శించారు. రోడ్డు పక్కన రోడ్డు, రోడ్డుపై రోడ్డు బాగున్న కాలువలను కూలగొట్టి కొత్తవి నిర్మించడం మానుకొని అసలు రోడ్లు కాలువలు లేని శివారు కాలనీలో రోడ్లు కాలువలు నిర్మించాలని కోరారు. ఈ పర్యటనలో యూనూస్, ఎల్లకృష్ణ, నయూం, రాముడు, ఖలీల్, యుగంధర్‌తో పాటు అనేకమంది కాలనీ మహిళలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ఏపి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా నియమితులైన ఎస్‌కె. శ్రీనివాసరావును కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎస్‌కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, యువ నాయకులు నారా లోకేష్ బాబుకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి, టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకట రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా చేస్తానని చెప్పారు. సాయంత్రం దేవి ఫంక్షన్ హాల్‌లో గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. గాయత్రి బ్రాహ్మణ సంఘం నాయకులు కల్యూర చంద్రశేఖర్, పిఎన్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నరేష్ కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలి

- ఐద్వా, సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆస్తి అవకాశం ఉంది కదాని అమ్మాయిల జీవితాలతో ఆడుకుంటూ ఏకంగా చంపేస్తున్న దేవనకొండ నరేష్ కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలని ఐద్వా, సిపిఎం, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని స్టార్ కేర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న శ్రావణిని ఐద్వా రాష్ట్ర నాయకురాలు కె.అరుణ, జిల్లా సహాయ కార్యదర్శి పిఎస్.సుజాత, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. ఆనంద్ బాబు, దేవనకొండ మండల నాయకులు సూరి, డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ బాషా, నాయకులు బాబి, పరామర్శించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా దేవనకొండ మండల కేంద్రంలో గత పది రోజుల క్రితం కట్టుకున్న భర్తేభార్య శ్రావణిని హత్యాయత్నం చేసి కొడుకుని ఏకంగా నీళ్ల డ్రమ్ములో ముంచి చంపిన ఘటన అత్యంత దుర్మార్గమైనదని వారు విమర్శించారు. ముద్దాయి నరేష్ గతంలోనే తన మొదటి భార్యను కూడా హత్య చేసినట్లు తెలిసిందన్నారు. ఆస్తి మదంతో పేదరికంలో ఉన్న శ్రావణిని పెళ్లి చేసుకుని ఏదాదిన్నర గడవకముందే ఆమెకు పుట్టిన ఎనిమిది నెలల పసికందుతో పాటు తల్లిని కూడా మట్టుపెట్టాలనే ప్రయత్నం చేశాడన్నారు. ఇదంతా వారి కుటుంబ సభ్యుల సహకారంతోనే జరిగిందని బాధితులు తెలిపారన్నారు. హత్యాయత్నానికి 15 రోజులు ముందు శ్రావణిని చిన్నపిల్లోడితో సహా ఇంటి నుండి తీసుకెళ్లి పొలంలో ఉన్న గదిలో నిర్బంధించి, తన అక్క కూతురుని చేసుకోవాలనే దానితో శ్రావణి తలపై రాడుతో దాడి చేసి చనిపోయిందనుకున్న తర్వాత పిల్లోడిని డ్రమ్ములో వేసి చంపేశాడన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈఘటనలోనరేష్ కుటుంబ సభ్యులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక లేమితో ఆయువు కోసం పోరాడుతున్న శ్రావణిని బతికించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని శ్రావణి బతికేందుకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నరేష్ కుటుంబ సభ్యుల నుండి శ్రావణికి, శ్రావణి కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలన్నారు.

శ్రావణిని పరామర్శిస్తున్న నేతలు

మహిళల హక్కుల కోసం ఐక్య ఉద్యమం

మహాసభలో మాట్లాడుతున్న పి.నిర్మల

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహిళల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల సూచించారు. ఐద్వా మూడవ నగర మహాసభలు జిబి.ఫంక్షన్ హాల్‌లో రషీదా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు కమ్మన్‌బీ జండా ఆవిష్కరించారు. పి.నిర్మల మాట్లాడుతూ మహిళలంటే వంట గదికి పరిమితం కాకుండా యాక్టర్‌గా, డాక్టర్‌గా, కలెక్టర్‌గా, పైలెట్‌గా ఇలా అన్నిరంగాలలో ప్రాధాన్యత పెరిగిందన్నారు. సమాజంలో సగభాగం మహిళలు ఉన్నారని అటువంటి మహిళల పట్ల ఈరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు మాట్లాడుతూ మహిళల పట్ల అగత్యాలు, అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ చట్టాలను సక్రమంగా అలము చేయడం లేదన్నారు. గృహహింస, అదనపు కట్నం వేధింపులు, తాగుడికి బానిసలు సంసారాన్ని అధోగతి పాలు చేస్తే అటువంటి సంసారాలను చక్కదిద్దు కోవడానికి ప్రభుత్వాలు ఏమిచేస్తున్నాయని ప్రశ్నించారు. మహిళలకు సాధికారికత కల్పిస్తామని చెబుతున్న పాలకులు వాస్తవికంగా ఏం చేస్తున్నాయని అన్నారు. ప్రతి మహిళకు లక్షాధికారి చేస్తా అంటున్నా ప్రభుత్వం మంచిదే అని రుణాలు ఇచ్చి తిరిగి కట్టిస్తే ఏ రకంగా లక్షాధికారి అవుతారని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళలందరూ కలిసి ఐక్యంగా ఉద్యమాలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఐద్వానూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా డి.రషీదా దేశాయ్, బంగి పద్మలతో పాటు మరో 21 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్ష కార్యదర్శులు డి.రషీదా దేశాయ్, బంగి పద్మ

1250 బస్తాల ఉల్లి వినియోగదారులకు విక్రయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలలో నాణ్యమైన ఉల్లిగడ్డలను ఆదివారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల సమక్షంలో మార్కెట్ వారు 45 కేజీల బస్తా రూ.100 విక్రయం ప్రారంభించారు. మొత్తం 1250 బస్తాల ఉల్లిగడ్డలను వినియోగదారులకు అమ్మినట్లు ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్. జయలక్ష్మి ఆదివారం తెలిపారు. రూ.1200 ధర ఈనెల 20 నాటికే ముగిసిందని, రైతులు, కమిషన్ ఏజెంట్లు గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, ముఖ్యమంత్రి వ్యవసాయ మార్కెటింగ్ మత్స్య , డైరీ డెవలప్మెంట్ శాఖ మాత్యులు కింజారపు అచ్చన్నాయుడు తెలిపారన్నారు. అమ్ముటకు తీసుకువచ్చే సమయంలో సరుకును ఆరబెట్టి గ్రేడింగ్ చేసుకొని మురుగు లేకుండా నాణ్యమైన సరుకును తెస్తే మంచి ధర లభిస్తుందని తెలిపారు. సోమవారం నుండి యధావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని ఆమె తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ఉల్లి రైతులను మోసం చేసిన ప్రభుత్వం

- రూ.1200తో పాటు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలి
- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్ర ప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఉల్లి రైతులకు ఎకరాకు రూ.20వేలు ఇస్తామని నిర్ణయించడం రైతులను మోసం చేయడమేనని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరా ఉల్లి సాగుచేసిన రైతుకు రూ.20వేలు ఇస్తామని ప్రకటించిందన్నారు. గతంలో క్వింటాకు రూ.1200 ప్రకటించిం దని, ఒక ఎకరాకు 70 క్వింటాళ్లు దిగుబడి వస్తే మద్దతు ధర ప్రకారమైతే ప్రభుత్వం ఇచ్చేది రైతుకు ఎకరాకు రూ.49 వేలవుతుందన్నారు. ఇప్పుడు కేవలం రూ.20 వేలు మాత్రమే ఇస్తామని అంటున్నారని, దీంతో రైతు రూ.29 వేలు నష్టపోతాడన్నారు. ఇది రైతును దగా చేయడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. ఉల్లి రైతులు ఒక ఎకరాకు పెట్టుబడి లక్ష ఇరవై వేలు వస్తుందని, ప్రభుత్వమేమో కేవలం రూ.20 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటుందన్నారు. ఇష్టం వచ్చిన చోట మిగతాది అమ్ముకోండి మార్కెట్‌కు కూడా రావాల్సిన అవసరం లేదంటున్నదన్నారు. గోడౌన్లలో ఆరబోసుకోండిని రైతు బజార్లో అమ్మిస్తామని గిట్టుబాటు ధర వచ్చేటట్ల అన్ని రకాలుగా సహాయం అందిస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పి నష్టపరిహారం అనే పేరుతో రైతులను మోసం చేస్తుందని తెలిపారు. గతంలో డోన్‌లో రూ.కోటి, కోడుమూరులో 90 లక్షలు, గూడూరులో రూ.90 లక్షలు ఖర్చుపెట్టి గోడౌన్లు నిర్మాణం చేశారని, అవి నిరుప యోగంగా ఉన్నాయన్నారు. వాటిని ఉపయోగంలోకి తీసుకు రావలసిన అవసరం ఉందని, ఇన్చార్జి మంత్రి నిమ్మల రామనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని తక్షణమే ఉపయోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి, నాయకులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

శ్రీరామనగర్ సమస్యలపై సిపిఎం సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామ నగర్ లో మున్సిపల్ సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ చేశారు. వార్డు నాయకులు ఎస్. అజ్మత్ అధ్యక్షత వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. నరసింహులు ,వార్డు శాఖ కార్యదర్శి కెవి జనార్దన్ రావు పాల్గొన్నారు. వారు 23వ వార్డు శ్రీరామనగర్ లో మున్సిపల్ సమస్యలు చాలా ఉన్నాయని డ్రైనేజీ కాలు, పగిలిపోయిన సిమెంటు రోడ్లు గుంతలుగా మారి ప్రజల రాకపోకలకు వాహనాల రాకపోకలకు చాలా కష్టంగా మారిందని తెలిపారు. పాడైన రోడ్లను వెంటనే వేయాలి. 49 /50 ఎ ఇంటి నెంబర్ గల లైన్ లో సిఎస్ఐ చర్చికి దగ్గరలో ఉన్న కల్వర్టు మ్యాన్ హోల్ మూత విరిగిపోయినెల రోజులకు పైగా అవుతున్న మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం చాలా అన్యాయం అన్నారు. వాహన దారులు చాలాఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మ్యాన్‌హోల్‌కు మూతను ఏర్పాటు చేసి ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి 23వ వార్డు శ్రీరామనగర్ లోని డ్రైనేజీ కాలువలలో షిల్టు తొలగించడం రోడ్లు కల్వర్టు పై మూతల ఏర్పాటు వంటి సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సిపిఎం వార్డు నాయకులు ఆర్. శేషంరాజు, బి.ప్రసాద్, సలాం భాష, ఆర్ మద్దిలేటి, భాష మొదలగు వారు పాల్గొన్నారు.

మభ్యపెడుతూ పంట భూములు లీజుకు

-కొనసాగుతున్న మధ్య దళారుల దందా-రెవెన్యూ అధికారుల ప్రేక్షక పాత్ర

ప్రజాశక్తి-పత్తికొండ

రాయలసీమ రతనాల సీమగా అని అంటారు. రతనాలసీమగా మారుస్తామని పన పాలకులు తరుచూ చెబుతుంటారు. ఆకల ఎప్పటికీ సాకారమవుతుందో చూడాలి. కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం పత్తికొండ. ఈ ప్రాంతంలో సరైన సమయానికి వర్షాలు పడక కరువు కాటకాలతో ప్రజలు అల్లాడుతుంటారు.

ఈతరుణంలో డివిజన్ కేంద్రమైన పత్తికొండ ప్రాంతంలో రైతులను మభ్యపెట్టి పంట భూములను సోలార్ ప్రయివేట్ కంపెనీకి మధ్య దళారులు భూములు లీజు ఒప్పందం చేయించడంలో దళారుల హవా కొనసాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం 400 మెగా వాట్లు విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనుంది. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ పత్తికొండ మండల పరిధిలోని హోసూరు -పెద్దహుల్తి గ్రామాల మధ్య 1800 ఎకరాలలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. రైతుకు సంవత్సరానికి ఎకరాకు రూ. 31000 చెల్లించి లీజు ఒప్పందం చేసుకుంటుంది. రైతులు వేరుశనగ, ఉల్లి, వాము,జొన్న ,కొత్తిమీర తదితర పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మధ్య దళారులు అమాయక రైతులకు మాయ మాటలు చెబుతున్నారు. సరైన సమయానికి వర్షాలు పడవు, పంటలు సక్రమంగా పండవని చెబుతూ రైతులను నట్టేట ముంచుతున్నారు. లక్షల విలువ చేసి పంట భూములను కారు చౌకగా ప్రయివేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారు. ఇప్పటికే రైతుల నుండి దాదాపు 1000 ఎకరాలు లీజు ఒప్పందం జరిగినట్లు సమాచారం. కనీసం రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పేక్షక పాత్ర పోషిస్తూ రైతులను అన్యాయం చేస్తున్నారని రైతు సంఘాలు నాయకులు మండిపడుతున్నారు.

లీజు ఒప్పందంలో రైతులు అవగాహన కలిగి ఉండాలి

భూ యాజమాని కౌలు రైతుకు ఒక ఎకరా సాగు చేసుకోవడానికి రూ.20,000 గుత్తా చెల్లిస్తే గడువు ఇస్తారు. మరో సంవత్సరం సాగు చేయాలంటే గుత్తా మాట్లాడిన తర్వాతనే పంట పొలంలోకి వెళ్ళనిస్తారు. అలాంటప్పుడు ఒక ప్రయివేట్ కంపెనీ 30 ఏళ్లకు లీజు చేసుకుంటున్నారు. మధ్య దళారులు మాటలు విని భూమిని కారు చౌకగా ప్రయివేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారను. ఎకరా పొలానికి ప్రైవేట్ కంపెనీ రూ.31, వేలు చెల్లిస్తే ఏ

సోలార్ పరిశ్రమకు సేకరిస్తున్న సాగుభూమి

విధంగా సరిపోతుందని రైతులు అవగాహన చేసుకోవాలి. కంపెనీకి రైతులకు ఎటువంటి సంబంధం లేకుండా ఆన్‌లైన్‌లో పేమెంట్ చెల్లింపులు జరుగుతాయని మాయమాటలు చెబుతారు. గత కొన్ని సంవత్సరాల తర్వాత కంపెనీ నష్టాలలో ఉందని గుత్త చెల్లింపులు జరగకపోతే ఎవరిని అడుగుతారో తెలియదు. అలాంటప్పుడు రైతులకు సోలార్ పవర్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తిగా ఉండాలి. మధ్య దళారుల మాయ మాటలు నమ్మి పిల్లల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మేధావులు, రైతుసంఘాలు విజ్ఞప్తి చేస్తున్నారు.

24న సోలార్ కంపెనీలకు వ్యతిరేకంగా చలో విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి

సంవత్సరానికి ఎకరాకు రూ. 50,000 గుత్త చెల్లించాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 20శాతం కౌలు పెంచి అగ్రిమెంట్ కాల పరిమితి గరిష్టంగా 10 సంవత్సరాలకు మించకుండా ఉండాలి. భూమిపై సోలార్ కంపెనీల ఆధిపత్యం లేకుండా ప్రభుత్వం మధ్యవర్తిగా ఉండాలి. భూమి మొత్తం కోల్పోయే రైతులకు, భూమిపై ఆధారపడి జీవించే భూమిలేని వ్యవసాయ కూలీలు, వృత్తిదారులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం అమలు డిమాండ్ చేశారు. ప్రైవేట్ సోలార్ కంపెనీల మోసాలపై రైతుల హక్కుల కోసం 24న ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టాం.

13 గంటల పనిబిల్లును ఉపసంహరించాలి

కార్మిక సంఘాల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-ఆదోని

శాసన సభలో 13 గంటల పని విధానానికి ఆమోదం తెలపడం సమంజసం కాదని, ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని కార్మిక సంఘాలు బగ్గుమన్నాయి. ఆదివారం ఆదోని మున్సిపల్ కార్యాలయం నుండి భీమస్ కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె. అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి వెంకన్న, పట్టణ సహాయ కార్యదర్శి ఓబి నాగరాజు ,సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు . పిఎస్ గోపాల్, తిప్పన్న ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి జి. ఎంకప్ప మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని కార్మికులందరూ కూటమి ప్రభుత్వానికి అధికారం కట్ట పెట్టారన్నారు. 8 గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచడమంటే శ్రమ దోపిడీకి వత్తాసు పలకడమే అవుతుందని దుయ్యబట్టారు. మహిళా కార్మికులను కూడా రాత్రి డ్యూటీకి రావచ్చును తీర్మానంలో పేర్కొనడం సమంజసం కాదన్నారు. తాము అధికారంలోకి వస్తే పని భారం తగ్గిస్తామని టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఇచ్చిన హామీని తుంగలో తొక్కరన్నారు. బిజెపి మెప్పు కోసం రాష్ట్రంలో ఉన్న కార్మికులను, ఉద్యోగులకు పని భారం మోపి యజమానులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. 13 గంటలు పని 6 గంటలకు ఒకసారి అర్ధగంట రెస్ట్ ఇవ్వాలని, వారానికి 60 గంటలు మించకుండా పనిచేయించాలనే ఆలోచన,

ఆదోనిలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

మహిళలకు పట్టపగలే సరైన రక్షణ లేదని, మహిళల రక్షణకు మద్దతుగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం రాత్రి పని చేయాలాని బిల్లు ప్రవేశపెట్టి పాస్ చేయడం ఏమిటిని ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా 8 గంటల పని విధానం వారానికి 6 రోజులు అంటేనే ఉద్యోగులు కార్మికులు మానసికంగా ఆరోగ్యంగా జీవించలేకపోతున్నారని సర్వేలు చెబుతున్నాయన్నారు. వారానికి 5 రోజులకు పని భారాన్ని తగ్గించాలని ఆ విధంగా ఉంటేనే మంచి ఫలితాలు రాబట్టవచ్చని అనేకమంది మేధావులు కోరుతూ ఉంటే అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని, మహిళలు రాత్రి వేళల్లో పని చేయాలనే బిల్లును పాస్ చేయడం చాలా దుర్మార్గం అన్నారు. అందులో భాగంగానే సోమవారం కార్మిక సంఘాలు బీమాస్ దగ్గర జరుగు నిరసనను జయప్రదం చేయలన్నారు.

ఉల్లికి హెక్టారుకు రూ. 50వేల సాయం

- టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉల్లి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉల్లి పంటకు హెక్టారుకు రూ. 50వేల ఆర్థిక సహాయం చేయనున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన ఆయన గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. ముందుగా పీఠాధిపతులు ఆయనకు శేషవస్త్రాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆ పార్టీ మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉల్లి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర లేక పోవడంతో ఇబ్బందులు గమనించిన సిఎం హెక్టార్‌కు రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించేందుకు హామీ ఇచ్చారని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలతో ఒక్కోసారి పంటల దిగుబడులు తగ్గవచ్చన్నారు. రైతులను అడ్డు పెట్టుకొని వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ పాలనలో ఉల్లి ధరలు పడిపోయినప్పుడు రైతులు రోడ్డెక్కినపుడు ఆయన ఏం చేశారో అందరూ చూశామన్నారు. అక్రమాస్తులు, అక్రమ మద్యం వ్యాపారం కేసులలో త్వరలో జగన్మోహన్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో కూటమి ప్రభుత్వం నేతృత్వంలో వ్యవసాయ రంగం బలోపేతానికి కృషి చేస్తుస్తున్నట్లు తెలిపారు. కోసిగి మండల నాయకులు భరద్వాజ్ శెట్టి, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథరెడ్డి, నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి, బిసి సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ హండే, అనుమంతు, గనేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ గనేకంటి గురురాజ, మద్రి యేబు, వగరూరు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

అబ్దుల్ పాల్గొన్నారు.

లోకేష్ బాబు స్పందనకు అభినందనలు..

కెజిబివిలో సీటు దొరక్క పత్తి సీడ్స్ పనికి వెళ్లిన జెస్సీ అనే చిన్నారి విషయంపై విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు స్పందించిన తీరుపై ఆయన అభినందనలు తెలిపారు. మంత్రాలయం మండలం బూదూరు గ్రామానికి చెందిన మీనిగ సంతోషమ్మ, కుమార్‌ల రెండో కుమార్తె జస్సీ గ్రామంలో ఐదో తరగతి పూర్తి చేసుకొని ఆరవ తరగతి చదువుకునేందుకు చిలుకలడోణ గ్రామ సమీపంలో ఉన్న కెజిబివి పాఠశాలలో దరఖాస్తు చేసుకోగా సీటు రాకపోవడంతో నిరాశతో బతుకు దెరువు కోసం తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్ళారు. విషయం ఒక పత్రికలో రాగా నారా లోకేష్ స్పందించి జస్సీకి కెజిబివిలో సీటు కేటాయించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాముల్ పాల్ ఎఇఒ రాఘన్నతో కలిసి చిలుకలడోణ గ్రామానికి చేరుకుని పాఠశాల ప్రిన్సిపల్ శాంతికి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

జిల్లాకు దామోదర సంజీవయ్య పేరు పెట్టాలి

ప్రజాశక్తి-ఆదోని

వెనుకబడిన ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి కర్నూలు జిల్లాకు దామోదర్ సంజీవయ్య నామకరణం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదరం రాధాకృష్ణ మూర్తి, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి విజ్ఞప్తి చేశారు. అభ్యుదయ దళిత సేవ సంఘం అధ్యక్షుడు కల్లపోతుల రంగన్న సెక్రటరీ కుంకనూరు వీరేష్ అధ్యక్షతన రెవెన్యూ భవన్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ , ఆదినారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, మానవ హక్కుల వేదిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు యూజీ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ దేవిశెట్టి ప్రకాష్, సిపిఐ అనుబంధ సంఘం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ హాజరయ్యారు. వారు మాట్లాడారు ఆదోని నియోజకవర్గం పూర్తిగా వర్షాధార ప్రాంతం కావడంతో పంటలు సరిగా పండక రైతులు ప్రతి ఏటా అప్పుల పాలవుతున్నారన్నారు. ఆదోనిలో ఉన్న పరిశ్రమలన్నీ మూతపడడంతో ఉపాధి కోసం మహా నగరాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని అభివృద్ధి చెందాలన్నా ఉపాధి అవకాశాలు రావాలన్నా జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమని ఇందుకోసం పార్టీలకతీతంగా కుల సంఘాలు విద్యార్థి యువజన సంఘాలతో పాటు ప్రజలు ఏకతాటిపై వచ్చి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సుమారు రెండు లక్షల జనాభా కలిగిన ఆదోని నియోజకవర్గం ని నాలుగు మండలాల విభజించాలని అప్పుడే పరిపాలన సౌలభ్యం మరింత సులభంగా ఉంటుందన్నారు. ఇప్పటికే పెద్ద హరివాణం ప్రజలు పార్టీల నాయకులు తమకు పెద్ద హరివానమును మండలముగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారని ఆదోని జిల్లా ఏర్పాటు అయితే మండలాలు కూడా ఏర్పాటు అవుతాయని అందుకోసం ఐక్య ఉద్యమాలు ద్వారా సాధించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. జిల్లా సాధన కోసం జెఎసిగా ఏర్పాటు చేసి వారు చేపట్టి ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని విద్యార్థి యువజన సంఘాల నాయకులు తెలిపారు.

సామాజిక దార్శనికుడు గురజాడ

జెవివి ఆధ్వర్యంలో గురజాడ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సామాజిక దార్శనికుడు గురజాడ వెంకట అప్పారావు అని లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అన్నారు. ఆదివారం కర్నూలు జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు జయంతి సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బీడీ సుధీర్ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లలిత కళా సమితి అధ్యక్షులు పతి ఓబులయ్య, జంధ్యాల రఘుబాబు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ బడే సాహెబ్, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా నాయకులు నరసింహ పాల్గొన్నారు. గురుజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆనాటి సమాజంలోని సాంఘిక సమస్యలను గుర్తించి వాటిపై తన రచనల ద్వారా చైతన్యం కల్పించారన్నారు. నేటితరం యువత గురజాడ రచనలను తప్పనిసరిగా తెలుసుకోవాలని కోరారు.

గురజాడకు నివాళి అర్పిస్తున్న పత్తిఓబులయ్య, రఘుబాబు, తదితరులు

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షులు జి.హేమంత్ కుమార్, ఐలు జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి, ఈశ్వరాస్ ట్యుటోరియల్ గౌరవ అధ్యక్షుడు డి ఈశ్వరయ్య, లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి యాగంటీశ్వరప్ప ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

గురజాడ సాహిత్య పురస్కారం ప్రకటించాలి

ఆదోని: తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన వారికి ప్రభుత్వం "గురజాడ అప్పారావు సాహిత్య పురస్కారం" అందించాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప డిమాండ్ చేశారు. ఆదివారం గురజాడ జయంతిని నైస్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ లో సాహితీ స్రవంతి డివిజన్ అధ్యక్షులు సక్కిరి భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. సాహితీ ప్రేమికులు అభ్యుదయ కవి గురజాడ వారి "దేశమును ప్రేమించమన్నా" దేశభక్తి గేయం ప్రతిరోజు పాఠశాల ప్రార్థనలో విద్యార్థులతో పాడించి, విద్యార్థులలో దేశభక్తిని కలిగించాలని ప్రభుత్వానికి సూచించారు. గురజాడ ముందుచూపు కలిగిన దార్శనికుడని, అతని కవిత్వాన్ని పాఠ్యపుస్తకాల ద్వారా సమాజానికి అందించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. భాస్కర్, అమలనాథన్, ఓంకార్, షేక్షావలి, నల్లారెడ్డి, ప్రేమ్ కుమార్, నరసప్ప, సుబ్బన్న లు పాల్గొన్నారు.

నిద్రమత్తులో గ్రామ పంచాయతీ : ఐద్వా

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు గ్రామ పంచాయతీ నిద్రమత్తులో తూగుతుందని ఐద్వా మండల కార్యదర్శి షేకున్‌బీ అన్నారు. మండలంలోని కోయనగర్ కాలనీలో ఐద్వా బృందం ఆదివారం పర్యటించి కాలనీ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. షేకున్‌బీ మాట్లాడుతూ బాలుర సమీకృత వసతి గృహం వెనుకాల చెత్తాచెదారం పేరుకుపోయిందని, డ్రెయినేజీ నీళ్లు నిల్వ ఉండడంతో పందులకు, దోమలకు ఆవాసాలుగా మారాయన్నారు. కాలనీ వాసులు

కోయనగర్ కాలనీలో పర్యటించిన ఐద్వా నేతలు

అనారోగ్యానికి గురై చిన్నపిల్లలకు, పెద్దవారికి టైఫాయిడ్, డెంగీ వ్యాధులు వస్తున్నాయన్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకుండా, కాలనీలలో పర్యటించకుండానే స్వచ్ఛ భారత్, పరిశుభ్రత అంటూ రెండు మాటలు చెప్పి చేతులు దులుపుకుంటూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారన్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్రవీడి కాలనీలలో చెత్తను తొలగించాలన్నారు. లేని ఐద్వా ఆధ్వర్యంలో కాలనీ వాసులను సమీకరించి పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా మండల నాయకురాళ్ళు రత్నమ్మ, గౌసియాబీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శ్రమదానం

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆదోని మండలం పాండవగల్లు గ్రామంలో అంగన్వాడీ భవనం, పంచాయతీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లోని రెండు గంటల పాటు శ్రమదానం చేపట్టారు. పిచ్చి మొక్కలు, గడ్డి ఉండడంతో దోమలు చేరి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని, ఈ పిచ్చి మొక్కలు తొలగించడంతో

శ్రమదానం చేస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

దోమలు నివారించొచ్చన్నారు. గ్రామాల్లో యువత పోరాటమే కాకుండా ఇలాంటి కార్యక్రమాల్ని నిర్వహించాలని డివైఎఫ్‌ఐ మండల కన్వీనర్ వీరేష్ తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు కె. వీరేష్, వీరాంజి, మండల కమిటీ సభ్యులు ఎస్. తాయన్న, మోహన్ రెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు అనంతస్వామి, మల్లికార్జున, ధనుంజయ, భాస్కర్, ప్రతాప్, హరి గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుకు అండగా టిడిపి ప్రభుత్వం

ప్రజాశక్తి- దేవనకొండ

లేక రాష్ట్టపోయిన ఉల్లి రైతులను ఆదుకునేందుకు టిడిపి ప్రభుత్వం హెక్టాక్ హెక్టార్కు 50 వేలు ప్రకటించడం ఆశించదగ్గ విషయమని రైతులకు టిడిపి ఎల్లప్పుడు అండగా ఉంటుందని టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, మలకన్న అన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయావరణలో ఆదివారం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న రైతన్నల కష్టాలను చూడలేక,ఉల్లి పండించిన ప్రతిరైతుకు ఒక హెక్టారుకు రూ.50వేలు ఇస్తామని శుభవార్త చెప్పారన్నారు. రాష్ట్ర చరిత్రలో రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వ నిర్ణయం చెరగని ముద్ర అన్నారు. టిడిపి నాయకులు రాజాషాబ్, మస్తాన్. టీవీ. రామాంజిని, కుక్కల తిమ్మయ్య. హుసేని,హనుమంతు, గాజుల శ్రీను. బంగి రంగన్న పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా: ఎఇఒ రమాదేవి

ప్రజాశక్తి-చిప్పగిరి

చిప్పగిరి మండలంలోని రైతులకు ప్రస్తుతానికి 12 టన్నులు యూరియా అందుబాటులో ఉందని ఎఇఒ రమాదేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు అవసరం ఉన్న రైతులకు యూరియా ఇవ్వాలని ఆదేశించిందన్నారు. అందుకుగాను యూరియా అవసరమున్న రైతుల మాత్రం యూరియా బస్తాలు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక రైతుకు సంబంధించిన ఆధార్ కార్డుకు రెండు యూరియా సంచులు మాత్రమే ఇస్తున్నామన్నారు. ఒక యూరియా సంచి ధర రూ.267 చెల్లించి తీసుకొని పోవచ్చు అన్నారు. యూరియా కావలసిన రైతులు కూడా వారికి అందుబాటులో ఉన్న రైతు సేవ కేంద్రాలకు వెళ్లి అగ్రికల్చర్ అసిస్టెంట్లకు తెలిపి వారి ద్వారా కూడా యూరియా సంచులు పొందవచ్చున్నారు.

-రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారి

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

-రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

అడవిలా తయారైన స్మశాన వాటిక

-సమస్యపై స్పందించని నాయకులు,అధికారులు

-విధుల నిర్వాహణలో ఆటంకం - గుంతలు పూడ్చే వ్యక్తుల ఆవేదన

ప్రజాశక్తి-నందవరం

నందవరం స్మశాన వాటిక ముళ్ల చెట్లతో దుర్భరంగా తయారైంది. సమస్యపై నాయకులు, అధికారులు స్పందించట్లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గుంతల పూడ్చే వ్యక్తులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో స్మశాన వాటిక పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. సుమారుగా 10 అడుగుల పొడవున చెట్లు మొలిచి అడవిలా తయారయింది. అందులో 20 సెంట్లు కూడ ఖాళీ ప్రదేశం కనిపించడం లేదు. ఒక మనిషి పుట్టినరోజు నుండి మరణించేవరకు అనేకమైన సమస్యలు, ఒడిదుడుకులు, కుటుంబ భారంతో విపరీతమైన ఒత్తిడికి గురై ఉంటాడు. మరణించిన తర్వాత చివరిగా పడుకునే ప్రదేశం స్మశానం. అక్కడైనా ప్రశాంతత దొరుకుతుందనుకున్నా చనిపోయిన మృతదేహానికి అక్కడ కూడా చేదు అనుభవం ఎదురవుతుంది. ఒక వ్యక్తి జీవితంలో అనుభవించిన కష్టాలకంటే ఇక్కడ పరిస్థితి గోరంగా ఉంది. వందల సంవత్సరాల క్రితం గ్రామంలో అప్పుడున్న జనాభా ప్రకారం కొన్ని ఎకరాల పొలాన్ని స్మశానానికి కేటాయించారు. ప్రస్తుతం ఇప్పుడు ఉన్న జనాభాకు సరిపోవటం లేదు. ఒక వర్గానికి సంబంధించిన వ్యక్తి మరణిస్తే ఆ మృతి దేహాన్ని పూరచడానికి అంతకు ముందు పూడ్చిన మృతదేహ అవశేషాలను తీసి పుడ్చాలిసిన పరిస్థితి నెలకొంది. ఉన్న స్థలంలో 90 శాతం ముళ్ళ చెట్లే ఆక్రమించేశాయి. అంత్యక్రియల అనంతరం కాళ్ళ చేతులు కడుక్కోవటానికి నీటి సదుపాయం కూడా లేదు. పరిస్థితి ఇంత గోరంగా ఉన్న నాయకులు, అధికారులు స్పందించకపోవడం బాధాకరమని గ్రామ పెద్దలు, ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలలో స్మశాన వాటికలను అధికారులు దగ్గర ఉండి శుభ్రం చేపించారు. ఆ అధికారులకు గ్రామంలో ఉన్న సమస్య మాత్రం పట్టడం లేదు. అధికారులు వివిధ గ్రామాలకు ప్రయాణించేటప్పుడు స్మశాన వాటికను చూస్తూ వెళుతున్నారు తప్ప పరిష్కారం వైపు ప్రయాణించట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. స్మశాన వాటిక శుభ్రపరచాలని చాలా సందర్భాలలో అధికారులకు, నాయకులకు తెలిపిన తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విధులు నిర్వహిస్తున్న సమయంలో తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామని గుంతను పూడ్చే వ్యక్తులు భాధను వ్యక్తపరుస్తున్నారు. రికార్డుల ప్రకారం సర్వే చేయించి ముళ్ల చెట్లను తొలగించి, చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని ప్రజలు

కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి

- చాకలి మద్దిలేటి,నందవరం గ్రామం

చనిపోయిన వ్యక్తుల అంత్యక్రియలు నిర్వహించడానికి స్మశాన వాటికలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాయకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

దట్టమైన చెట్లు వలన ఆటంకం

- మాదన్న, నందవరం

దట్టమైన చెట్లు మొలచి ఉన్నాయి. శవాన్ని పుడ్చటానికి గుంత తవ్వే సమయంలో ఆటంకలు ఎదురవుతున్నాయి. స్మశానంలో మలచిన చెట్లను నరికి, వాటి మొద్దులు తీసి గుంత తవ్వాలి. ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడానికి ఎక్కువగా శ్రమించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

అధికారులు పొంతనలేని సమాధానాలు

మండల ఉన్నత అధికారిని వివరణ కోరగా నాకు సంబంధంలేదు. రెవెన్యూ అధికారులన డుగు వారే దానికి సంబంధమని చెప్తున్నారు. గ్రామానికి సంబంధించిన అధికారిని అడగగా ఉన్నతాధికారులు, గ్రామ సర్పంచితో మాట్లాడుతానని పొంతనలేని సమాధానాలు చెప్పారు. గతంలో కూడా సమస్యపై వివరణ కోరగా ఈ అధికారులు మాట దాటవేశారు.

లాల్ నీల్ ప్రయాణమే వెంకటకృష్ణ కవిత్వం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

తెలుగు సాహిత్యంలో వెంకటకృష్ణ మూడు దశాబ్దాలు పైగా ప్రగతిశీల కవిత్వాన్ని రాస్తూ మనిషి కేంద్రంగా సాహిత్య సృజన చేస్తున్నారని, ఆయన ప్రయాణం లాల్ నీల్ సిద్ధాంతమని వక్తలు అన్నారు. ఆదివారం కర్నూలు టిజివి కళాక్షేత్రంలో వెంకటకృష్ణ కవిత్వం పుస్తకం ప్రముఖ మార్క్సిస్ట్ మేధావి గడియారం భార్గవ ఆవిష్కరించారు. ఆవిష్కర్త మాట్లాడుతూ మూడు దశాబ్దాలపైగా వెంకటకృష్ణతో స్నేహం ఉందని, ఒక నిబద్ధత గల కవిత్వంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆయన రాసిన లోగొంతుక కవిత్వం గురించి రచయిత్రి నాగమణి మాట్లాడుతూ కవిత్వం వై విధ్యంగా సాగుతుందని, సామాన్యుని కేంద్రంగా కవిత్వ సృజన ఆయన ప్రత్యేకత అని అన్నారు. దున్నే కొద్ది దుఃఖం కవిత్వం గూర్చి రచయిత

వెంకటకృష్ణ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మారుతి పౌరోహితం మాట్లాడుతూ మార్క్సిస్టు కోణం పర్యావరణ స్పృహ రూపవాదం ఆయన కవిత్వం వస్తువులని సామాజిక వర్గాల సంఘర్షణ సాహిత్యానికి మార్చడానికి మధ్య సంబంధాన్ని తెలిపే కవిత్వం ఇందులో సారమని అన్నారు. కొన్ని రంగులు ఒక పద్యం కవిత్వం గూర్చి సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ వెంకటకృష్ణ కవిత్వంలో శిల్పం నడక దక్పథం వైవిధ్యంగా ఉంటుందన్నారు. సామాన్యుడి కేంద్రంగా గొప్ప శిల్పాన్ని రాసే కవిగా ఆయన ఆవిష్కరించబడతాడని అన్నారు. చినుకు దీవి కవిత్వం గూర్చి రాయలసీమ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ కవిత్వంలో ఉద్వేగం జాతి వివక్ష అస మానతలు తదితర అంశాలు కనబడతాయన్నారు. వెంకటకృష్ణ 2018 నుండి 2022 వరకు రాసిన కంచె దాటే పాట కవిత్వాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగారమోహన్ విశ్లేషించారు. వెంకట కృష్ణను ఘనంగా సత్కరించారు.

ఉల్లి రైతుకు భరోసా ఇచ్చిన ఘనత బాబు దే : కుబేర్ నాథ్

ప్రజాశక్తి-ఆదోని

ఉల్లి సాగు చేసి నష్టపోయిన రైతన్నకు అండగా నేనున్నానంటూ ఆర్థికంగా భరోసా కల్పించిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కిందని టిడిపి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వ్యాపారవేత్త కుబేర్నాథ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఉల్లి సాగు చేసి అమ్మకానికి రైతుకు గిట్టుబాటు ధర లేక నష్టపోయిన రైతుకు చేదోడుగా నిలవడం హర్షణీయమన్నారు. ఉల్లి రైతుకు హెక్టారుకు రూ.50 వేల చొప్పున నగదు సహాయం అందించాలని తీసుకున్న నిర్ణయంతో ఎంతోమందికి మేలు జరుగుతుందన్నారు. ఉల్లికి ధరలు లేక నష్టపోతున్న రైతులకు నగదు సహాయం భారీగా ఊరటనిస్తుందన్నారు. ఉల్లి రైతులకు అండగా ఉండేందుకు కిలో రూ.12కి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండటంతో పాటు , రూ.100 కోట్లకు పైగా ప్రభుత్వం పై భారం పడుతున్నప్పటికి ముందుకు రావడం రైతులపై ఉన్న ప్రేమ తేటతెల్లమవుతుందన్నారు ఉల్లి పండించి నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.50 వేల చొప్పున సహాయం అం దించేందుకు ముం దుకు వచ్చిన ప్రభుత్వం, రైతుల సంక్షేమం కోసం వెనకడుగు వేయ కూడదని స్పష్టం చేసిం దన్నారు. వైసిపి పాలనలో అనేక సార్లు ఉల్లి ధరలు పతనమ య్యాయన్నారు. అప్పటి ముఖ్య మంత్రి జగన్ ఉల్లి రైతులను పట్టించు కోలేదని ఆరోపించారు..

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న సునీల్ రాజ్ కుమార్‌ను తోటి మిత్రులు(ఎన్ఎంఎంహెచ్ ఎస్ పదో తరగతి బ్యాచ్ మేట్స్) ఆదివారం పూలమాల శాలువాతో సన్మానించారు. పలువురు మిత్రులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ (డివిజన్) జడ్జికోర్టు : పత్తికొండ.

E.P.No.24/2024 IN O.S.No.92/2019

Between:

G.Ram Mohan. ...Decreeholder

-Vs-

K.Veeranna died by LR's
1.K.Lakshmi
2. K.Jyothirmai
3. K.Hindu. ...Judgement Debtor

బహిరంగ వేలం ప్రకటన

ఇందుమూలముగా సాదారణ జనానికి తెలియజేయడం ఏమనగా పైన తెలిపిన డిక్రీహోల్డర్ క్రింద కనపరచిన షెడ్యూల్ దాఖాల ఆస్తిని తనబాకీ రాబట్టుకొనుటకు గాను పైన కనపరచిన కోర్టులో వేలం వేయుటకు ఆర్డరు పొందివున్నారు. ఈ వేలం తన బాకి, లోబడి విక్రయం చేయబడును. కోర్టువారు 06-11-2025 తేదిన పైన తెలిపిన కోర్టు అవరణము నందు ఉదయం 10.30 గంటలకు షెడ్యూల్ ఆస్తిని వేలం వేయబడును ఎవరైన సదరు వేలంలో పాల్గొని షెడ్యూల్ దాఖల ఆస్తిని కొనుగోలు చేయవచ్చునని తెలియజేయడమైనది.

షెడ్యూలు

Land Situated at potlapadu village of devankonda mandal within the Registration district of Kurnool and witheis the sub Rgistration District of Pattikonda With the following particulars.
Item No. III S.No.104/2 Exten : Ac 3.11 Cents
East : Boya Lakshmanna Land
West : Vanka
North : Road
South : Sudhkara and Ramudu Land,
Sal will be conducted : Subject to E.P Amount
Market Value : 5,00,000/-
వేలము తేది : 06-11-2025

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

T.Mallesh - 6301553292
B.Prasad Babu - 9703082974
T.Veeraswamy - 9912266019,
Advocates , Pattikonda/Yemmiganur.